## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



నగదు అందజేస్తున్న ముల్లు రమణ

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ, రమాదేవి దంపతులు రూ.1.50 లక్షలు విరాళం ప్రకటించారు. ఈమేరకు పట్టణంలోని తన నివాసం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం నగదు అందజే శారు. ట్రస్టు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణు మూర్తి, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

### నేత్రశస్త్ర చికిత్సకు 51 మంది ఎంపిక



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జాక్సన్

మెరకముడిదాం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గర్భాం పీహెచ్‌సీలో సోమవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ 103 మందికి నేత్రపరీక్షలు చేసి 51 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని క్యాంపు సమన్వయకర్త సీహెచ్.అశ్వనీకుమార్ తెలిపారు. పీహెచ్‌సీ ఈఓ మురళి, హెచ్‌వీ నాగలక్ష్మి, నర్సింగ్‌స్టాఫ్ ఉష తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



హెచ్‌ఎం శారదాదేవికి సౌండ్ సిస్టమ్ పరికరాలు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల 1998–99 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.24వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. సౌండ్ సిస్టమ్ పరికరాలను హెచ్‌ఎం శారదా దేవికి పూర్వవిద్యార్థులు సోమవారం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థికి నగదు ప్రోత్సాహకం




విద్యార్థి దిలీప్‌కుమార్, తల్లి సంతోషిని అభినందిస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన వెంకటరమణపేట ఉన్నత పాఠశాల విద్యార్థి మైచర్ల దిలీప్‌కుమార్‌కు ఎస్.కోట కేంద్రంగా పనిచేస్తున్న 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ సభ్యులు నగదు ప్రోత్సాహకం అంద జేశారు. సోమవారం ఆ పాఠశాల వేదికగా విద్యార్థి దిలీప్‌కుమార్, అతని తల్లి సంతోషిని ఆ పాఠశాల వేదికగా గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది కలిసి సన్మానించారు. స్నేహ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థి దిలీప్‌కుమార్‌కు భవిష్యత్‌లో విద్యావసరాలకు తగిన ఆర్థిక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. స్నేహ సంఘ అధ్యక్ష,కార్యదర్శులు ఏ.ఎస్. వెంకటరావు, ఎం.సుబ్బారావు, సభ్యులు ప్రకాశ్, శ్రీరామ్మూర్తి, హెచ్‌ఎం లక్ష్మి, గ్రామపెద్దలు రాపర్తి సాదు, కనిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

### ర్యాగింగ్ తగదు

• సీఐ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్సై ఆరంగి సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ పి. పైడిరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఫుట్ బాల్ గ్రౌండ్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): యువత,విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని గరివిడి ఎస్‌ఐ ఎల్. దామోదరరావు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ ల్ల కలిగే దుష్ప్రభావాలు, మద్యం,దూమపానం వంటి అలవాట్లతో కలిగే అనర్థాలపై గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యువతకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అవగాహన లోపంతో చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని, గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఎక్కువ శాతం యువత మాదక పదార్థాలను మొదట సరదాగా తీసుకుని, తర్వా త వాటికి బానిసలుగా మారుతున్నారని వివరించారు. దురలవాట్లు మీ జీవితాలతో పాటు మీపై ఆదారపడే కుటుంబాలను సైతం నాశనం చేస్తాయని చెప్పారు. విద్యార్థులు, యువత ఓ లక్ష్యం పెట్టుకుని, ఆదిశగా కృషి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు.

**చెడు వ్యసనాలకు బానిస కావొద్దు**

గుర్ల: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని, చక్కగా చదువుకోవాలని గుర్ల ఏఎస్‌ఐ కామేశ్వరరావు సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యా ర్థులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశ నం చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించుకుని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, కళాశాల ఎన్ ఎస్ఎస్ పీఓ టి.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



గుర్ల: గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ కామేశ్వరరావు



బొండపల్లి: బొండపల్లి హైస్కూల్/ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

**మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి**

బొండపల్లి: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, యాంటీ ర్యాగింగ్, ఫోక్సో చట్టాలపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల /జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేయక తప్పద న్నారు.హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం



సమ్మె విరమణ అనంతరం కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ సుధారాణి

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీలోని కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను సర్పంచ్ మంగళగిరి సుధారాణి పరిష్కరించారు. గత నాలుగు రోజులు గా చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో పని చేస్తున్న కార్మికులు తమ వేతనాల సమస్య పరిష్క రించాలని కోరుతూ సమ్మె చేపడుతున్నారు. దీంతో పంచాయతీలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచి పోయాయి. కార్మికులు, పంచాయతీ అధికారుల తో సర్పంచ్ సోమవారం చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారంపై సర్పంచ్ సానుకూలంగా స్పందించడంతో కార్మికులు సమ్మె విరమించి, తక్షణమే విధుల్లోకి చేరారు. కార్మికులతో జరిపిన చర్చల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, వార్డు ప్రతినిధి రౌతు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై ఫిర్యాదు

శృంగవరపుకోట: పట్టణంలోని రాజుచెరువులో ఆక్రమణలను తొలగించి, ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు.ఈమేరకు వీరంతా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగల క్ష్మిని కలిసి తమ గోడు వినిపించారు. గత నెలలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, 21న సర్వేకు రావాలని చాటింపు వేయించి, అడ్డగోలు గా సర్వే చేసి వెళ్లి పోయారని వివరించారు. అధికారులు నిర్ధారించిన హద్దుల్లో తప్పులు ఉన్నాయని, సర్వే కాపీ తమకు ఇవ్వాలని, కొలతలు వేసి చూపాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. పాత రికార్డుల ప్రాప్తికి కచ్చితమైన హద్దులు తేల్చాలని కోరారు. శిథిలమైన మదుములను పునర్నిర్మించాలని కలెక్టర్‌ను కోరామని చెప్పారు. పది రోజుల్లో చెరువును సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.రైతులు ఎన్.సూరిబాబు, మోపాడ కృష్ణ, పొట్నూరు రమణ, కొటాన రాము, డి.అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ



యువతకు పౌష్టికాహారం అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: పోలీస్, ఆర్మీ, నేవీ తదితర ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతూ పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రన్నింగ్, ఇతర అంశాల్లో సాధన చేస్తున్న యువతకు ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ సోమవారం పౌష్టికాహారం అందజేశారు. రమణ మాట్లాడు తూ హైకోర్టు న్యాయవాది మజ్జి సూరిబాబు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆయన నిధులతో యువతకు కోడిగుడ్లు, ఎనర్జీ డ్రింక్స్, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశామని చెప్పారు.

## దత్తిరాజేరు ఆర్‌ఐగా రామ్‌కుమార్



ఆర్‌ఐ రామ్‌కుమార్

దత్తిరాజేరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా రామ్‌కుమార్ స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.ఈయన బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## ఘనంగా బ్రదర్స్ డే



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, మెసానిక్ టెంపుల్ సభ్యులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మెసానిక్ టెంపుల్ సంస్థ యూనివర్సల్ బ్రదర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, తదితర మత పెద్దలు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిచారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్ నుంచి మయూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు.

## అలవెన్స్‌లు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, డీఈఓలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్లాంటేషన్, రెవెన్యూ విభాగాల్లో పనిచేసే స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లకు వేతనాలతో పాటు రిస్క్ అలవెన్స్‌లు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్‌మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

# పాఠశాలల సందర్శన



ముకుందపురం పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ-1 జగదీశ్వరరావు



ఆకులసీతంపేట పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని ముకుందపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–1 జగదీశ్వరరావు, ఆకుల సీతంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులను, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, పాఠశాలల్లో మౌలికవసతులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలను నిర్వాహకులు మెనూ ప్రకారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీఆర్పీలు కోటేశ్వరరావు తదితరులు ఎంఈఓలు వెంట ఉన్నారు.

# ఆర్వోబీ పనుల పరిశీలన



ఆర్వోబీ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్‌లో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)నిర్మాణ పనులను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు రైల్వే, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆర్వోబీ నిర్మాణ పనులకు గత ప్రభుత్వ హయాంలోనే రూ.12.99 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఆ నిధులతో జరుగుతున్న పను లను ఎమ్మెల్యే పరిశీలించారు. జి.అగ్రహారం, కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీ తదితర ప్రాంతాలకు సర్వీస్ రోడ్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేను, అధికారులను కోరారు. అలాగే పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ వైపు చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమకు నష్టం కలగకుండా చూడాలని వ్యాపారులు ఎమ్మెల్యేను కోరారు.నిబంధనల ప్రకారం ప్రజలకు నష్టం కలగకుండా, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టి త్వరితగతిన ఆర్వోబీ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అయితే కొత్తఅగ్రహారానికి సర్వీస్ రోడ్ ఇవ్వాలంటే ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించాల్సి ఉంటుందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, పైల బలరాం తదితరులు పాల్గొన్నారు.

# సాదా సీదాగా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్ సంతోషికుమారి

శృంగవరపుకోట: స్థానిక పంచాయతీ సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా ముగిసింది. పంచాయతీ కార్యాలయలంలో పంచాయతీ ఈఓ కన్నబాబు నేతృత్వంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీతంపేట వార్డు సభ్యురాలు చింతల సత్యవతి మాట్లాడుతూ మూడు రోజులుగా సీతంపేట గ్రామానికి తాగునీటి సరఫరా నిలిపేశారని, గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణం సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గౌరీనగర్‌లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వార్డు సభ్యుడు కాపుగంటి వాసు చెప్పగా, బర్మా కాలనీలో బోరు పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వార్డు సభ్యుడు సంతోష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. యాతవీధి, సీతారామాంజనేయ థియేటర్ల వద్ద కల్వర్టులు నిర్మించాలని వార్డు సభ్యులు ఆదారి సూరి బాబు, సరిపల్లి రామకృష్ణ కోరారు. పలు వార్డుల్లో సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించాలని సర్పంచ్‌ను కోరారు. సర్పంచ్ సంతోషికుమారి వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వార్డుల్లో చేయాల్సిన పనులు, సమస్యలను వివరిస్తే ప్రాధాన్యతా పరంగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈఓ కన్నబాబు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని కోరారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ వర్షాకాలంలో సీజన్‌లు వ్యాధులు వ్యాపించే అవకా శా లు ఉన్నందున, గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు.రక్షిత మంచినీటి పథకాలను క్లోరినేషన్ చేయించి, సురక్షిత తాగునీరు అందించే విధంగా చూడాలని చెప్పారు. తహసీల్దార్ హనుమంతు రావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

**దత్తిరాజేరులో..**

దత్తిరాజేరు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రజాసమస్యలపై వినతులు స్వీకరించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. ప్రజలెవరూ వినతులు ఇచ్చేందుకు రాకపోవడంతో ఎంపీడీఓ చంద్రకుమారితో పాటు పలు శాఖల అధికారులు నిర్ణీత సమయం వరకు ఉండి వెళ్లి పోయారు.

# రైతులందరికీ వరి విత్తనాలు అందిస్తాం

• ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులందరికీ వరి విత్తనాలు అందజేస్తామని, ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కేంద్రం రైతులకు రాయితీపై ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా కొత్త వలస, లక్కవరపుకోట మండలాల రైతులు వర్షాధారంగా వ్యవసాయం చేస్తుంటారని తెలిపారు. తనకు వచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో సింహభాగం వ్యవసాయరంగానికే ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తవలస సబ్ డివిజన్ ఏడీ ఎల్.విజయ మాట్లాడుతూ నియోజకవ ర్గంలో ఖరీఫ్ వరి సాధారణవిస్తీర్ణం 17,648 హెక్టార్లు కాగా 8,823 క్వింటాళ్ల విత్తనాలు అవస రమని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. 8,726 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు కాగా వాటిని రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేశామని చెప్పారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలి పారు. మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, టీడీపీ నాయకులు మల్లు నాయుడు, రామకృష్ణ, కోళ్ల కృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఏఓ స్వాతికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గజపతినగరం: స్థానిక కేతలనగర్ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణకర్తలు ఆంజనేయమూర్తి,రత్నకుమారి దంపతులతో వేదపండితు లు స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆల యం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

# పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మెరకముడిదాం: పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ పావని



వేపాడ: పంచాయతీకార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ నిశ్చల



గుర్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

మెరకముడిదాం: వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని, సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని పంచా యతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి ఎంపీడీఓ పావని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో ఎంపీడీఓ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో రక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి కుళాయి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీలైనంత వరకు ఆ పైపులైన్లను బయట నుంచి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నివాస పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈఓపీఆర్డీ పుష్పారావు తదితరులు పాల్గొన్నారు.

**క్లోరినేషన్ చేయించాలి**

వేపాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు తాగునీటి ట్యాంకుల్లో 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ నిశ్చల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమ వారం సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్లాప్ మిత్రాలు గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లోని కుండీల్లో వేసి కంపోస్టు తయారు చేయించాలని సూచించారు. తాగునీటి పైపు లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎక్కడైనా లీకులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని, తాగునీటి బోర్ల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ ఉమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, పీహెచ్‌సీ వైద్యాధికారులు ధరణి, రమాదేవి పాల్గొన్నారు.

**గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి**

గుర్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు డెంగ్యూ, డయేరియా, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. అలాగే 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకపఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న ఆశయ రమణ

మెరకముడిదాం: పుస్తకపఠనంతోవిజ్ఞానం పెరుగుతుందని, పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలని చీపురుపల్లికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డిరమణ సూచించారు. యాడిక గ్రామ ప్రాథమికోన్నత పాఠశా లలో ఆశయ రూరల్ లైబ్రరీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు మొబైల్ లైబ్రరీలోని పుస్తకాలను అందజేసి చదివించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్‌లు, టీవీలతో కాలక్షేపం చేసి సమయం వృథా చేసుకోకుండా పుస్తక పఠనం చేయాలని సూచించారు. పుస్తక పఠనం జ్ఞాపకశక్తితో పాటు సృజనాత్మకను పెంచుతుందన్నారు. శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు, ఇతిహాసాలు, గ్రంథాలను చదవాలని చెప్పారు.